# సెంటిమెంట్

ఇంటికి బయలుదేరుతూ వుండాగా " అయ్యగారు పిలుస్తున్నారు" అన్నాడు అటెండరు ఆదినారాయణ.

"అర్జంటు ఫైలేదో మళ్ళీ పుటప్ చేయమంటాడు కాబోలు" విసుక్కుంటూ ఆఫీసరు గదిలో కెళ్ళాడు అన్నాజీరావు.

"రావోయ్ అలా కూర్చో"

బాస్ మర్యాదకి ఆశ్చర్యపోతూ "పర్వాలేదు చెప్పండి సార్" అన్నాడు అన్నాజీరావు నిలబడే.

"నువ్వీనెల ఫి. యప్ అడ్వాన్సు అందుకున్నట్లుంది"

"ఔన్సార్. మా చెల్లాయి పెళ్లికి చేసిన అప్పు తీరుద్దామని"

"సరేలే. ఏవో అవసరాలుం టాయి. లేకపోతే డబ్బెందుకు? నాకు అర్జంటూగా ఐదు వేలు కావాలి సర్దగ లవా?' అడిగాడు బాస్.

అతడికి ఏ మాటా చెప్పలేక బిక్క మొహం పెట్టాడు అన్నాజీరావు.

అన్నాజీరావు అవస్థను గమనించిన ఆఫీసరు "ఇవాళ బ్యాంకులో డబ్బుడ్రా చేద్దామని పాస్ బుక్ పంపిస్తే వేళమించిపోయిందన్నారు. రేపు ఆది వారం. ఎల్లుండి నీ డబ్బు నీ చేతుల్లో ఉంటుంది. ఈ అవసరాలరావు ఎంతో అవసరం ఉంటే తప్ప అప్పు జోలికి పోడు'' అన్నాడు.

ఆఫీసరంతటివాడు ఒక గుమస్తాని అంత ఇదిగా అర్థిస్తూ వుంటే ఎలా కాదనగలడు?

అందుకే కిమ్మనకుండా డబ్బుతీసి బల్ల మీద పెట్టాడు.

సోమవారం ఆఫీసరు పిలుపు కోసం ఎంతగానో ఎదురుచూసాడు అన్నాజీరావు.

ఆ రోజే కాదు నెల రోజులైనా తీసుకున్న సొమ్ము వాపస్ చెయ్యలేదు ఆఫీసరు.

కొంపతీసి తన డబ్బు సంగతి మరచిపోలేదు కదా అనుకుని ఒ రోజు "సార్, మీరు నా వద్ద తీసుకున్న ఐదు వేలు. . ." అంటూ గుటకలు మ్రింగాడు అన్నాజీరావు.

"అరెరెరె. . . నీకు డబ్బివ్వాలి కదూ మరిచేపోయానయ్యా. రేపు డ్రా చేసి ఇస్తాన్లే" అన్నాడు ఆఫీసరు నొచ్చుకుంటున్నట్లుగా.

సరే తీసుకున్న సొమ్ము గుర్తుంది కదా అనుకున్నాడు. అయితే అతడికి నిరీక్షణే మిగిలింది.

ఇక లాభం లేదనుకుని పొరుగింటి పుల్లారావుతో తన గోడు వెళ్ళబోసుకున్నాడు.

పుల్లారావు, అవసరాలరావు సన్నిహితులు. "ఎల్లుండి ఈపాటికి నీడబ్బు మీ ఆఫీసరు నీకిచ్చేస్తాడు సరేనా. ఇహ నిశ్చింతగా ఉండు" అభయమిచ్చాడు పుల్లారావు.

పుల్లారావు చెప్పినట్లుగానే ఆరోజు ఆఫీసరు తీసుకున్న సొమ్ము అన్నాజీరావుకి రిటర్నయింది.

అమితాశ్చర్యపోయాడు అన్నాజీరావు. ఆఫీసుపని అయ్యాక పుల్లారావు ఇంటికెళ్ళి "గురువుగారూ, మీరే మంత్రం వేసారో గాని నా డబ్బు నాకు దక్కింది. మీ మేలు ఈ జన్మలో మరచి పోలేను" కృతజ్ఞతల తెలియజేసుకున్నాడు.

"మంత్రమా పాడా నీ దగ్గర అప్పు తీసుకుని బాకీ తీర్చని వీర్రాజుకు వాంతులు, విరోచనాలు పట్టుకుని సీరియస్ అయిపోయిందన్నాను. అలాగే నీ వద్ద వెయ్యి రూపాయలు తీసుకుని ఎగ్గొట్టాలనుకున్న శ్రీధర్ బాల్జీ తన్నేసాడని బొంకేను. అంతే నీకు ఇవ్వవలసిన ఐదు వేలు నీకు ఇవ్వకుంటే తనకేంకీడు జరుగుతుందోనని హడలిపోయి బాకీ తీర్చేసాడు. మనదేశంలో దేనికీ లొంగనివాడు సెంటిమెంటుకి విధిగా లొంగుతాడు. అందుకే ఆ అస్త్రాన్ని సంధించాను" అన్నాడు పుల్లారావు.

**(13-8-1998 ఆంధ్రభూమి వీక్లీ)**